# అస్థిపంజరం

గన్ను కృష్ణమూర్తి

అస్థిపంజరం వెళ్తోంది!

అందరూ చూస్తుండగానే నడిచి బజార్లోంచి వెళ్తోంది!

పట్టపగలే నడిచి వెళ్తోంది!

ఎవ్వరూ దాన్ని చూసి, పారిపోడం లేదు. జడుసుకోవడం లేదు. పైగా నవ్వుకుంటున్నారు.

ఆ అస్థిపంజరం నేరుగా వెళ్ళి చౌరస్తాలో నిలబడింది. నలువైపులా చూచింది. ఓ కిళ్ళీ షాపు వైపు దారి తీసింది. కిళ్ళీ షాపు వాడితో ఏదో మాట్లాడింది. వాడు కూడా దాంతో పరాచికాలాడాడు. ఏదో యిచ్చి, పంపించాడు.

ఆ అస్థిపంజరం ఎంతో దర్జాగా, బీడీ కాలుస్తూ, పొగ వదుల్తూ వెళ్తోంది.

ఇంతలో మరో అస్థిపంజరం వచ్చింది.

దాని వెనకాలే సైజులువారీగా మరో నాల్గుగు అస్థిపంజరాలు ఎగురుతూ, దూకుతూ వచ్చాయి.

రెండో అస్థిపంజరం సరాసరి వచ్చి, మొదటి అస్థిపంజరం ప్రక్కనే బైఠాయించింది. మిగతా పిల్ల అస్థిపంజరాలన్నీ చుట్టూ చేరి, గంతులేయసాగాయి.

వాటిని చూడ్డానికి అందరికీ వినోదంగా ఉంది. తమాషా చూసినట్టు చూడసాగారు.

ఇంతలో బలంగా గాలి వీచింది.

ఆ గాలికి ఆ అస్థిపంజరాలన్నీ అమడ దూరం ఎగిరిపడ్డాయి. ఒకదాన్నొకటి గట్టిగా కావలించుకున్నాయి. గాలి పోగానే, మట్టి దులుపుకుని, మళ్ళీ లేచి నిలబడ్డాయి. పెద్ద అస్థిపంజరం చుట్టూ మూగాయి.

"ఆకలేస్తోందయ్యా!" అడిగిందో పిల్ల పంజరం.

"ఆకలేస్తే ఛావు!" కసురుకుంది పెద్ద పంజరం.

"ఊఁ ... ఊఁ ... ఊఁ" అంటూ ఏడవసాగిందా పిల్ల పంజరం.

"అమ్మకు జొరంగా ఉందయ్యా!" అంది మరో పిల్ల పంజరం రెండు చేతుల్తో తలకాయని బరుక్కుంటూ.

"అందరూ కట్టగట్టుకు ఛావండి" విసుక్కుంది పెద్ద పంజరం.

"నాకూ ఆకలేస్తోందయ్యా!" అడిగింది మరొకటి.

"ఏం కూడు తిన్లేదూ?"

"నేదు."

"ఏటికి?"

"అమ్మ యియ్యాల కూడొండనేదు".

"ఏం తెగులు దానికి?"

ముందే చెప్పాగా. జొరమొచ్చినాదని!"

"ఎందుకొచ్చింది జొరం? ... నానేం రోగం నేక ఉన్నానా? ... నాకు నేదూ జొరం, దగ్గు? ... ఛస్తుండాను. రొండు దినాల్నుంచి" దగ్గిందా పంజరం.

గంట నుండీ సిటీ బస్సు కోసం ఎదురు చూస్తున్న నాకు ఈ దృశ్యం కంటబడింది. అందరికి ఆనందంగా ఉన్నా, నన్ను మాత్రం కలచివేసింది.

అందరినీ పంపించి, ఓ బుల్లి అస్థిపంజరాన్ని వెంటేసుకుని, నడక సాగించాడు ఆ అస్థిపంజరంలా ఉన్న వ్యక్తి. నావైపే రాసాగాడు. నన్ను సమీపించాడు.

"అగ్గి వుందా సామీ!" అంటూ చేయి చాచాడు ఆరిపోయిన బీడీని ఊదుతూ.

మొలకి లంగోటీ తప్ప, ఒంటిపైన మరో వస్త్రంలేదు. ఎముకలు బయటపడి, లెక్కెట్టడానికి వీలుగా ఉన్నాయి. వాడి వెంటున్న పిల్ల బొచ్చు కుక్కని తలపింపజేస్తోంది. తైల సంస్కారం లేని జుత్తుతో! ఆకాశంలో ఉన్న నక్షత్రాలెన్నో చెప్పొచ్చుగానీ, అది వేసుకున్న గౌనుకి చిరుగులెన్నో చెప్పడం కష్టం.

నాకు బీడీ, సిగరెట్ కాల్చే అలవాటు లేదు. అందువల్ల లేదని చెప్పాను. వాడు ముందుకు వెళ్ళబోయాడు. పిల్చాను. దగ్గరగా వచ్చాడు. జేబులోంచి పావలా బిళ్ళ తీసి, ప్రక్కనే ఉన్న కిళ్ళీ కొట్టులో ఓ పెట్టె తీసుకొమ్మని యిచ్చాను.

వాడు అగ్గిపెట్టెని తీసుకొచ్చి, పెట్టె, చిల్లర డబ్బులు ఇవ్వబోయాడు.

"నీ దగ్గరే ఉంచు" అన్నాను.

వాడి కళ్ళు కృతజ్ఞతతో వెలిగాయి. వంగి దణ్ణం పెట్టాడు. నేను కాళ్ళని వెనక్కి తీసుకున్నాను.

వెళ్ళబోతుంటే కూర్చోమన్నాను.

వాడూ, వానితోబాటు వాడి కూతురూ నేను కూచున్న బెంచీ ప్రక్కనే నేలమీద కూలబడ్డారు. వాడు బీడీ వెలిగించి దమ్ము లాగుతూ, తన లంగోటీలో ఏదో వెదకసాగాడు.

"ఏమిటీ?" అన్నాను.

"బీడీలండీ!" అన్నాడు గుప్పిటి నిండా ఎంగిలి బీడీ ముక్కల్ని బయటకు తీస్తూ. నాకు డోకొచ్చినంత పనయింది.

ఆ బీడీ ముక్కల్లోంచి ఓ ముక్కని వెలిగించి, ఆ పిల్లకిచ్చాడు. ఆ పిల్ల దగ్గుతూ, ఆయాసపడుతూ దమ్ము లాగసాగింది.

"ఏం పేరు?" అడిగాను.

"బీవుఁడు" అన్నాడు వాడు తాపీగా.

నాకు నవ్వాగలేదు. "అదేం పేరోయ్? అన్నాను నవ్వుతూనే.

"పీనుగులా ఉన్నోడికి యిదేటి పేరనుకుంటుండారా బాబూ? మడిసన్న తరువాత వో పేరుండాలి గంద సామీ! ... అయినా తవఁరడిగేరు గానీ, నా పేరెట్టి పిలిసేవోడేడండీ. యీ భూ పెపెంచకంలో!" అన్నాడు.

"సరేకానీ భీవుడూ! నువ్వు కాల్చితే కాల్చావుకానీ, ఆ పిల్లకెందుకిస్తున్నావు బీడీలు?" అన్నాను.

"గదా సామీఁ!" అంటూ వాడు నాకన్నా హెచ్చుగా నవ్వాడు. వాడినవ్వుకు నాకు అర్థంతో చలేదు.

"ఆ పిల్లకి బీడీలిచ్చి దాని ఆరోగ్గం యెందుకు పాడుసేత్తున్నావనేగా మీరంట! అయ్యా! తవఁరున్నోరు. మేము లేనోళ్ళం! తవఁరన్నట్టుగా మేము బీడీలు కూడా మానేత్తే, ఎట్టా బతకాలంటారుసామేఁ!... నేనంటే రెండుదినాలైనా నీళ్ళుతాగి వుండగల్ను! గీ పొల్లెట్టుంటదంటారు? ఈ బీడీముక్కైనా కాలిత్తే కాస్త ఊపిరి నిలుత్తాది. నేదా ఈ పేనం గాల్లో కల్సిపోతాది."

"మరి జబ్బుచేయదూ?" అన్నాను.

"జబ్బేటిసామీ! ఈ బీడీ తాగితే రేపు పోతాది పేనం. తాగకుంటే ఈరోజే పోతాది! గిన్నెడు బువ్వ సేసేపని ఈ ఒక్క బీడీముక్క సేత్తాదిసామీ! అన్నం పెట్టమంటే కసురుకుంటాడు మడిసి! ఇక బీడీలంటారా? ఎంగిలిముక్కలు ఏడైనా దొరుకుతాయి, ఏ అయ్యని నిప్పడిగినా యిస్తాడు. ఇక ఆరోగ్గమంటారా? ఏదోనాడు రాలిపోవాల్సిందే ఈ సెత్త! ఈ సెత్తుండి ఎర్ని బాగుసేత్తుండాది సామీ! మాలాటోళ్ళు ఎంత తొందరగా రాలిపోతే, దేశానికి అంతమంచిది సామీ!" అన్నాడు వేదాంత సారాన్ని వెలిగ్రక్కుతూ.

"ఏంపనిచేస్తుంటావు?" ప్రశ్నించాను మళ్ళీ. వాడు మళ్ళీ నవ్వాడు.

"మాకెవరిత్తారండీ పని?... మమ్మల్ని సూత్తేనే అసయ్యించుకుంటారు. కూలిదొరికితే సేత్తాం!... నేదా అడుక్కుతింటాం" అన్నాడు.

"పోనీ, రిక్షా తొక్కకూడదూ?" అన్నాను. వాడు మళ్ళీ పొట్టచెక్కలయ్యేలా నవ్వాడు.

"ఏదో అన్నట్టుగా వుందండీ తవఁరు సెప్పేది.

నాకు రిచ్చా దొరకాలముందు. రిచ్చా దొరికాక, ఆర్నెల్లు నన్నేసామ్మైనా మేపాలా. నాకు ఒళ్ళు రావాల! అప్పుడుగాని నేను రిచ్చా నడపాల!... ఇదంతా సాద్దెమేనాసామీ!" అన్నాడు.

నాకేం మాటాడాలో తోచలేదు.

"నీ కెందరు సంతానం?" అడిగాను మాటమారుస్తూ.

"అరుగురండీ. నలుగురు ఆడ. ఇద్దరు మొగ."

"ఇందర్నెందుకు కన్నావు? ఆపరేషన్ చేయించుకోలేకపోయావ్?"

"అయన్నీ పెద్దోరికేనండీ! మాకు ఆపరేషన్ ఎవరుసేయాల? సేసినా ఈ కట్టెకి పేనం నిలుస్తుందంటారా? ఆ కత్తి సూసేసరికే మాప్రైపేనం పైనే పోతుంది.... అయినా మాకేటికండీ ఆప్రేషను! కూడు లేనోళ్ళకి?... మీలాంటి దొర్లకు కావాలసామే!"

"ఎందుకు?"

"ఎందుకేంటి?... నల్గురం నాలుగు దార్లెంట ఎల్తేగాని, ఏ ఒక్కరికైనా కూడు దొరకదు. రోజు గడువదు. కూలిసేసినా నలుగురి సంపాదన కలిత్తేగాని రోజెళ్ళదు".

నా కెందుకో వాడిమాట నమ్మబుద్ధికాలేదు. ఆ మాటే అన్నాను వాడితో.

"మోసేవాడికెరుకన్నారుసామీ కావిడి బరువు!... మా విసెయం మీరాలోచించలేరు. అర్థం సేసుకోలేరు. అయినా ఏట్లో ఎన్ని బుడగలు పుట్టినా పుట్టకున్నా ఏటికేంలోటుసామీ! ఏరుదారి ఏరుదే!... బుడగల దారి బుడగల్దే! అట్టాగే మేమూ!" అన్నాడు.

నేను ఆలోచనల్లో పడ్డాను.

"ఏసిన పిందెలన్నీ పూలుకావు సామే! అయిన పిందెలన్నీ కాయిలు కావు. అట్టాగే ఈల్లూనూ! నాకు పదిమంది పుట్నేరు. అర్లో ఈ ఆర్గురు మాతరం మిగిలేరు. ఈరు పెరిగి పెద్దయేలోగా ఎందరు రాలాతరో ఏటో! మమ్మల్ని తగిలేడానికి ఒక్కరైనా మిగిలేతే మాకదే పదేలు సామీ! ఆల్లే నేకుంటే మాసెవాల్ని కుక్కైనా ముట్టదు సామీ!" అన్నాడు.

వాడి మాటల్లో కొంతైనా నిజం లేకపోలేదనిపించిందినాకు. వా డన్నట్లు ఏట్లోవాడూ, ఏటి ఒడ్డున నేనూ! ఎన్ని నీతులు చెప్పి ఏం లాభం! ఆ ఏట్లోకి దిగి చెయ్యందిస్తే తప్ప! అనుకున్నాను.

యాంత్రికంగా జేబులోకి వెళ్ళింది చెయ్యి! ఓ రూపాయి బిళ్ళా, ఏ యాభై రూపాయనోటూ తగిలాయి.

"ఈ రూపాయిచ్చేస్తే?" అనుకున్నాను.

"కానీ వాడికే మొదలవుతుంది? గంజినీళ్ళైనా దొరకవు ఈ కరువుకాలంలో! పోనీ, ఈ యాభై రూపాయల్నోటిచ్చేస్తే?... పదినిముషాల సంపాదన! రామూర్తి, వేంకటేశమూ కలిసి బలవంతంగా పేకముక్కలు పంచితే, వచ్చిన బాపతు!... రాలేదనుకుంటేసరి!... కనీసం ఓ వారం రోజులైనా కడుపునిండా తింటాడు" అనుకున్నాను.

"ఒరేయ్ భీముడూ! ఈ డబ్బు నీదగ్గరుంచు!" అంటూ వాడిచేతిలో ఆ పెద్దకాగితాన్నుంచాను.




వాడు పక్షవాతం వచ్చినట్లుగా మెడలు వారగిల వేసి ఓ చెయిప్రక్కకు వాల్చేసి, గ్రుడ్లు మిటకరిస్తూ, నోరు తెరిచేశాడు. ఓ నిముషందాకా వులుకూ పలుకూ లేదు!

నాకు కంపరం వేసింది. ఈ శాల్తీ టిక్కెట్టు

పుచ్చుకోలేదుకదా! అనుకున్నాను.

"ఏమిటో యీ భీముడూ!" అన్నాను గాభరాగా.

ఆ నోటుని కిందామీదా త్రిప్పిచూస్తూ "ఇది నాకేనా సామీ!" అన్నాడు నమ్మకం కలగక.

"నీకేనో యీ!"

"నన్నో ఆటపట్టించాలని సూత్తుండారు! నాకింత ఆశనేదు సామీ!" అంటూ ఆ నోటుని నా చేతిలో వుంచుతూ.

"టీ డబ్బులీయండి సాలు!" అన్నాడు.

"అబద్ధం కాదు భీముడు! నిజం!... నీ దగ్గిరే వుంచు!" అన్నాను మళ్ళీ వాడిచేతుల్లో పెడుతూ.

"నానంత ఎడ్డి మడిసిని కానండీ! నాకేటీ మీ రు యాభైరూపాయలు ఈడమేటి?... నానంత ఎడ్డి మాలో కంలా వుండానా సామీ? వొద్దు సామీ వొద్దు ఈ పేదోల్లతో సెలగాటాలాడొద్దు!" అన్నాడు రెండుచేతులూ జోడిస్తూ.

"నిజంగా భీముడూ! ఇది నీకే! తీసుకో!... నీ పిల్లల కేమైనా కొనిపెట్టు!" అంటూ మళ్ళీ వాడిచేతిలో నే పెట్టాను.

"వొద్దు బాబూ వొద్దు!... మీరుణంలో పడేటో కండి! మీ కాళ్ళట్టుకుంటాను" అన్నాడు వంగి వంగి దండంపెడుతూ.

"ఫరవాలేదు వుంచు. అంతగా అయితే నెమ్మదిగా తీర్చుకుందుగానీ... వుండనీ" అంటూ బలవంతంగా వాడిచేతుల్లో ఆ నోటు వుంచాను. వాడి కళ్ళలో అశ్రువులు ధారలుకట్టాయి. జీవనదిలా పరుగులు దీశాయి. మరుభూమిలోంచి పాతాళగంగ దూకుతున్నట్లుగా వుంది వాడి కళ్ళకేసి చూస్తుంటే!

వాడి నోట మాట రావడంలేదు. పెదాలు అదురుతున్నాయి. జోడించిన చేతులు వణుకుతున్నాయి! మనిషి నిలువెల్లా కంపించి పోతున్నాడు.

నా కళ్ళు కూడా ఆర్ద్రాలయాయి.

బస్సు వచ్చిందికూడా గమనించలేదు.

"బాబూ బస్సొచ్చేసింది! తీసుకోండి!..... వద్దు! నాకీ డబ్బులొద్దు! మీ కాళ్ళట్టుకుంటాను!..... సచ్చి మీ కడుపున బుడతాను.....తీసుకోండి?" అంటూ నా చేతిలో పెట్టేశాడు.

నేను వారించి కదుల్తున్న బస్సునెక్కేసాను. వాడు బస్సు వెంట చాలా దూరం పరుగెత్తుకొచ్చాడు.

కానీ, అందుకోలేక వెనకబడిపోయాడు. పడిపోయాడు.

బస్సులోని ప్యాసెంజర్లు నావైపే ఆశ్చర్యంగా చూస్తున్నారు. యదార్థంలోకొచ్చి కళ్ళు తుడుచుకున్నాను.

మళ్ళీ క్షణాల్లో ఊహల్లోపడిపోయాను.

వాడా యాభై రూపాయలు ఇంటికి తీసుకెళ్ళినట్లూ, భార్యాకు మందులిప్పించినట్లూ, పిల్లళకు చవకరకం బట్టలు కొనిపెట్టినట్లూ, కడుపునిండా తిండి తిన్నట్లూ, కంటినిండా కునుకుతీసినట్లూ, క్రమక్రమంగా పని సంపాదించుకున్నట్లూ, తన కాళ్ళపై తాను నిలబడగలిగినట్లూ, సమాజంలో కలిసిపోయి నట్లూ వాడు నా కళ్ళముందు మెదిలాడు.

ఆలోచనల్నుండి తేరుకునేసరికి. బస్సు చివరి స్టాపులో ఆగివుంది. ఎంతసేపయిందో తెలీదు. బస్సులో నేనుతప్ప మరెవ్వరూలేరు. నా పరధ్యానానికి నవ్వుకుంటూ బస్సు దిగిపోయాను.

* * * * *

ఓ వారం రోజుల్తరవాత అదే బస్టాపులో కనిపించిందా అస్థిపంజరం. అప్పటికిప్పటికీ ఏమాత్రం తేడాలేదు. పైగా ముఖంలో కళలేదు. వెలవెలాబోతోంది. నన్నుచూసి ఉడుములా పట్టుకుంది.

"సామీ ఆగండాగండి" అంటూ.

"ఏమిటో యీ! బాగున్నావా?" అన్నాను.

"ఇదుగోండి మీ డబ్బులు!... హమ్మయ్య!... ఇన్నాళ్ళకి దొరికారు మిమ్మల్ని వెతకలేక ఛస్తున్నాను" అంటూ నేనిచ్చిన యాభై రూపాయల నోటు రొంటిలోంచితీసి, నా చేతిలో వుంచాడు. సందేహంలేదు. అదే నోటు. కాకపోతే కాస్త నలిగిపోయింది.

"ఏమిటిది?" అన్నాను నా కళ్ళను నేనే నమ్మలేక.

"వొద్దు సామీ!... వొద్దు!... ఈ డబ్బుల్తో మా పేనాలు పోయేట్టున్నాయి" అన్నాడు.

"ఎందుకు?" అడిగాను.

"అయ్యోయ్యో!... ఏం చెప్పమంటారుసామీ!... ఈ డబ్బులట్టుకెళ్ళిందగ్గిర్నించీ అన్నీ కష్టాలే!" అన్నాడు.

నేనర్థంగాక తెల్లమొహం వేశాను.

"ఈ డబ్బులెట్టి మా అడదానికి మందులు కొందామనుకొన్నాను. అది మంచానపడి శానా పొద్దులవుతానాది. ముక్కుతూ, మూల్గుతూ పనిసేత్తా వుంది. నాకూ పిల్లలకీ! నేనే అంటే నాకంటే పిలగా, ఉలిపిరికట్టిలా తయారైనాది. కానీ ససేమిరా ఇనుకోడం లేదు. దానిసుగదరగ! దాంది మొండి-పట్టంటే నమ్మండి. 'నాకు మందుమాకూ ఏమీ వొద్దు. నాకేటి నే బాగానే వుండాను. నువ్వు మగమడిసివి. కష్టంచేవోడివి. సాకేవోడివి నువ్వే మందులు కొనుక్కో'మంటూ పేనాలు తోడతా వుంది. ఎంతసెప్పినా ఇనుకోదు. నాకే మందూ, మాకూ వొద్దని మొత్తుకుంటే, బట్టలు కొనుక్కోమంటున్నాది: పోరలకు ఒంటిమీద మొలతాడు కూడా నేదాయె. వాళ్ళనిడిచి, నేనెట్టా కుట్టించుకుని కులకమంటాయ? మీరే సెప్పండి సామి!... నేను ఒప్పుకోనేదు. ఇప్పుడు పిల్లలు ఎంటబడుతున్నారు. 'మాకు కుట్టించండయ్యా! మాకు' అని ఒక్కరు గాదు. ఇద్దరుగాదు. ఆరుగురు పోరీలు. ఎరినిడిచి, ఎరికి కుట్టించమంటారు సెప్పండి!... పోనీ ఎలాగో తంటాలుబడి కుట్టిస్తానే అనుకోండి. ఈళ్ళు కొత్తగుడ్డలేసుకుని తిరిగితే, ఈళ్ళమొహాన బిచ్చమెవడు ఏస్తాడు?... ఇట్టా తల్లికడుపుల్నుంచి ఊడినట్టుంటేనే ఈజనాలకు కనికారం కలుగడం నేదాయె! ఇక బట్టలేసుకుంటే ఏదూ దగ్గిరకిరానీదు. పోనీ గింజలు కొందామనిచూశా! కానీ గింజలు కొనుక్కొని సుష్టుగా తిండం నేర్సితే, ఈ యెదవలు సోమర్లైతారనీ, ఈ కొడుకులు మళ్ళీ బిచ్చమెత్తసావరనీ, పాడైపోతారనీ ఓ దిగులు! అందుకని ఏటి సెయ్యాలో పాలుపోడంనేదు సామి! రోజా యింట్లో గడబిడే! కూస్త డబ్బులు నాసేత కనిపించేసర్కి, దొంగనాయెదవలు సుట్టూ తిరుగుతుండారు మా గూడేన. నాకు అప్పిమ్మంటే, నాకంటూ! తాగుబోతునాయెదవలు! ఈట్ని కాపాడుకోడాన్కి నిద్దరకూడా పోడంనేదీమధ్య! ఈటికన్నిటికంటే మీ డబ్బు మీకీడం మేలనిపించింది బాబుగోరూ! మీ డబ్బులు మీదగ్గిరే వుంచండి! మీకు పున్నెముంటుంది" అంటూ రెండు చేతులూ దొరికించుకొని, ఆ యాభైరూపాయలు నాకిచ్చేసి, పరుగులాంటి నడకతో వెనక్కి చూడకుండా, పిలిచినా మాట్లాడకుండా వెలుగుల్ని భరించలేని గబ్బిలంలా చీకట్లలో కలిసిపోయాడు. □

